https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 | సంచిక : 58 | మంగళవారం 30-06-2026 | పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# ఒంటరి పోరుకే సై?

**తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి**

**అన్నింటినీ గెలుచుకునేందుకు వ్యూహం.. కోవర్టు రాజకీయాలపై అగ్రనాయకత్వం సీరియస్**

**ఆ నేతలకు పార్టీ అధ్యక్షుడు నబీన్ హెచ్చరిక!**



హైదరాబాద్, జూన్ 29

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగేందుకు బీజేపీ సన్నద్ధమవుతోంది. ఒంటరిగా పోటీ చేసి అధికార పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా పార్టీ సంస్థాగత కార్యాచరణ ఇప్పటికే సిద్ధమైందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రంలో పర్యటిస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. అంతర్గత కార్యాచరణకు శ్రీకారం చుట్టారని తెలిపాయి. సంస్థాగత బలోపేతంతోపాటు ప్రజా సమస్యలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలను పార్టీ ముమ్మరం చేయనుందని, ప్రజాప్రతినిధులకు టైం టేబుల్ కూడా సిద్ధమవుతోందని ఆ వర్గాలు వెల్లడించాయి. 'ఈ రోజు తేదీ గుర్తుపెట్టుకోండి. అధికారంలోకి వచ్చాక ఈ తేదీని గుర్తుచేసుకోవాలి. అధికారంలోకి రావడమే మన టార్గెట్' అని నితిన్ నబీన్.. పార్టీ ముఖ్యనేతల సమావేశంలో స్పష్టం చేశారని పేర్కొన్నాయి. దీంతోపాటు పార్టీ ప్రజాప్రతినిధులు ఏయే కార్యక్రమాలు చేయాలో కూడా దిశానిర్దేశం చేసినట్లు తెలిపాయి. 'బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు' అంటూ తమ ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో అది ఒట్టి మాటేనని పార్టీ ముఖ్యనేతలు అంటున్నారు. రాష్ట్రంలో పార్టీ రోజురోజుకీ బలపడుతోందని వారు పేర్కొంటున్నారు. అయితే చివరి ఆరు నెలల్లో ఏమవుతుందో ఇప్పుడే అంచనా వేయలేమని మరికొందరు నేతలు అంటున్నారు. కర్ణాటకలో జరిగే ఎన్నికల ఫలితాలు తెలంగాణపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. 'అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోతే.. తెలంగాణలో ఒంటరిగా వెళ్లడం పక్కా. లేనిపక్షంలో అప్పటి పరిస్థితులను బట్టి పార్టీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది' అని బీజేపీ మరో కీలక నేత ఒకరు చెప్పారు. కర్ణాటకలో 2023 మే నెలలో.. అంటే మన రాష్ట్రంలో కంటే ఆరు నెలలు ముందుగా ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. షెడ్యూలు ప్రకారం 2028 మే లోగా అక్కడ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జిగా కొనసాగుతున్న సునీల్ బన్సల్ ఇక పూర్తిస్థాయిలో తెలంగాణలో పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారని పార్టీ ముఖ్యనేత ఒకరు వెల్లడించారు. " బన్సల్ తెలంగాణతోపాటు బెంగాల్, ఒడిసాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆ రెండు రాష్ట్రాల్లో పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఆయన ఇక తెలంగాణకు పూర్తి సమయం కేటాయించబోతున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంపై క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షించి దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జిగా కొనసాగుతున్న అభయ్ పాటిల్‌కు పార్టీ జాతీయ నాయకత్వం కార్యక్రమాల పర్యవేక్షణకు సంబంధించి మరో కీలక బాధ్యత అప్పగించింది" అని ఆ నేత వివరించారు. ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రోజువారీ కార్యక్రమాలపై ఢిల్లీకిఎప్పటికప్పుడు నివేదికలువెళుతున్నాయని

మిగతా 2లో...

# రేపు ఇరాన్‌తో దోహాలో చర్చలు

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



వాషింగ్టన్ డీసీ (అమెరికా), జూన్ 29:

హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరుపక్షాల మధ్య ఇటీవల జరిగిన సైనిక ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర ప్రకటన చేశారు. అమెరికాతో సమావేశం కావాలని ఇరాన్ అభ్యర్థించిందని, రేపు దోహాలో టెహ్రాన్‌తో చర్చలు జరుగుతాయని చెప్పారు. అయితే, మరోవైపు, ఈ వారం ఎలాంటి సాంకేతిక సమావేశాలు షెడ్యూల్ చేయలేదని ఇరాన్ అధికారులు చెబుతున్నారు. తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించారు.'ఇరాన్ ఒక సమావేశాన్ని అభ్యర్థించింది. అది రేపు దోహాలో జరుగుతుంది' అని మాత్రమే ట్రంప్ తన పోస్ట్ లో పేర్కొన్నారు. అంతర్జాతీయ వార్తా కథనాల ప్రకారం, వ్యూహాత్మక జలమార్గం హోర్ముజ్ జలసంధి గుండా జరిగే సముద్ర రవాణాపై నియంత్రణ కోసం ఇరుపక్షాలు కొత్తగా దాడులు చేసుకున్న నేపథ్యంలో ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడానికి ఖతార్‌లో ఈ సమావేశం జరగనుందని వెల్లడించాయి. రేపు (మంగళవారం) జరగనున్న సమావేశాన్ని అమెరికా అధికారులు కూడా ధృవీకరించారు. అయితే, సాంకేతిక చర్చలు తక్షణమే ప్రారంభం కానున్నాయని సూచిస్తున్న నివేదికలను ఇరాన్ అధికారులు తోసిపుచ్చారు. ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రకారం, పశ్చిమాసియాలో సంఘర్షణను అంతం చేసే లక్ష్యంతో కుదిరిన 14-సూత్రాల అవగాహన ఒప్పందం పరిధిలో ఈ వారం ఎలాంటి సాంకేతిక వర్కింగ్ గ్రూప్ సమావేశాలు షెడ్యూల్ చేయలేదని ఇరాన్ న్యాయ, అంతర్జాతీయ వ్యవహారాల ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ గరీబాబాది తెలిపారు. శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్‌తో సాధారణ సంప్రదింపులు ఎప్పుడూ జరుగుతుంటాయని, అయితే దోహాలో ఇప్పుడే సాంకేతిక స్థాయి చర్చలు ప్రారంభమవుతున్నాయంటూ వస్తున్న మీడియా నివేదికలలో ఎలాంటి నిజం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రేపు దోహాలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరుగుతాయా, లేదా అన్న అంశంలో సందిగ్ధత నెలకొంది.

# వైసీపీ కొత్త డ్రామా!

**మొన్న 3 రాజధానులు.. నిన్న మావిగన్ మాట.. నేడు అమరావతి పరిరక్షణట!**

**ద్వంద్వ విధానాలను ప్రజలకు చెప్పండి**

**అధికారం కోసం ఎంతకైనా తెగించే పార్టీ**


**రైతుల పరామర్శలో రౌడీషీటర్లు ఎందుకు?**

**క్రిమినల్ పార్టీ.. రౌడీయిజాన్నే నమ్ముకుంది**

**పవన్‌పై విమర్శలు తిప్పికొట్టండి**

**సాయికృష్ణ నేరచరితుడే అయినా.. చట్టప్రకారమే శిక్షించాలి!**

**మంత్రులతో భేటీలో సీఎం వ్యాఖ్యలు**



అమరావతి, జూన్ 29

వైసీపీ ఓ క్రిమినల్ పార్టీ అని, రౌడీయిజాన్నే నమ్ముకుందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. "శుభ కార్యాలకు వెళ్లినా, పరామర్శలకు వెళ్లినా గొడ్డలి పార్టీ నేతల వెంట రౌడీ షీటర్లు ఉండాల్సిందే. ఆ పార్టీ నైజాన్ని నిత్యం ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉంది. అధికారం కోసం వారు ఎలాంటి పనులకైనా బరితెగిస్తారు.వారి అమరావతి పర్యటనే దీనికి నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం లంచ్ సమావేశం నిర్వహించారు. అమరావతిని మొన్నటి వరకు వ్యతిరేకించడంతోపాటు, అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టే రోజు కూడా మావిగన్ అని మాట్లాడి వైసీపీ నేతలు నవ్వులపాలయ్యారని సీఎం తెలిపారు. అలాంటిది ఇప్పుడు అమరావతి పరిరక్షణ సమితి పేరుతో కొత్త డ్రామాకు తెర లేపారన్నారు. వైసీపీ ద్వంద్వ విధానాన్ని జనంలోకి తీసుకెళ్లాలని ఆయన మంత్రులకు సూచించారు. అసలు రాజధాని అమరావతిని తాము గుర్తించబోమని చెప్పి, మూడు రాజధానుల స్థానంలో మావిగన్ అంటూ ప్రతిపాదించిన జగన్ ఇప్పుడు రైతు పరిరక్షణ సమితి పేరుతో నేతలను పంపడం ఏమిటని, పరామర్శలకు వెళ్లే వారు రౌడీషీటర్లను వేసుకుని దండయాత్ర మాదిరిగా వెళతారా అని సీఎం ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన వ్యక్తులే రాజధానికి వైసీపీ నేతలతో కలిసి వెళ్లిన దృశ్యాలు మీడియాలో వైరల్ అయ్యాయన్నారు.

మిగతా 2లో...

# ఉపాధి హామీపై సీతక్క వినతి

**- గ్రామీణాభివృద్ధి మంత్రుల సమావేశంలో సీతక్క**

**- ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌పై ప్రభావం చూపే నిబంధనలు సవరించాలని విజ్ఞప్తి**

**- పేదల ఉపాధి హక్కును పరిరక్షించాలని కేంద్రానికి లేఖ**

న్యూఢిల్లీ, జూన్ 29:

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన సోమవారం ఢిల్లీలో జరిగిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రుల సమావేశంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూలై 1, 2026 నుంచి అమల్లోకి రానున్న 'వీబీజీ రామ్ జీ' చట్టం వల్ల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)పై పడే ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వ ఆందోళనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి సీతక్క లేఖను అందజేశారు. కొత్త నిబంధనల కారణంగా ఉపాధి హామీ పథకం అమలులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, గ్రామీణ పేదల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడకుండా తగిన మార్పులు చేయాలని ఆమె కోరారు. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విధాన నిర్ణయాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే రాజ్యాంగబద్ధమైన హక్కుగా కొనసాగాలని సీతక్క పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఉపాధి లభిస్తోందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది కీలక ఆధారమని తెలిపారు. కొత్త నిబంధనల వల్ల పేదలకు ఇబ్బందులు కలగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని సీతక్క వివరించారు. పథకంలో ఉన్న లోపాలను సరిదిద్దితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. సమావేశంలో వివిధ రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి మంత్రులు తమ రాష్ట్రాల అనుభవాలు,



మిగతా 2లో...

# విద్యుత్ ఉద్యోగుల సేవలు అభినందనీయం

**- ఉద్యోగుల సన్మాన సభలో సీఎం డీకే శివకుమార్**

**- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ**

**- విద్యుత్ రంగం రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక అని వ్యాఖ్య**



2

# బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

**- మంచిర్యాల జిల్లాలో ఘటన**

**- గంటల పాటు అవస్థలు పడ్డ ప్రయాణికులు**

**- జేసీబీతో బస్సును బయటకు తీసిన గ్రామస్తులు**

# వరంగల్ పోలీస్ కమిషనర్‌గా శ్వేత

**సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్**

**రాష్ట్రంలో 12 మంది ఐపీఎస్‌ల బదిలీ**

**22 మంది నాన్ కేడర్ ఎస్పీలు కూడా**





హైదరాబాద్, జూన్ 29

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఎన్. శ్వేత నియమితులయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నార్త్‌రేంజ్ శాంతిభద్రతల జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఆమెను ప్రభుత్వం వరంగల్ సీపీగా బదిలీ చేసి, భద్రాద్రి జోన్-4 డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆ స్థానంలో హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం విజయ్‌కుమార్‌ను నియమించింది. వరంగల్ సీపీగా పనిచేస్తున్న సన్‌ప్రీత్‌సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేసి, సిరిసిల్ల జోన్-3 డీఐజీగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 మంది ఐపీఎస్?లను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీగా ఉన్న డీఐజీ పోస్టుల్లో సీనియర్ ఐపీఎ?సలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అందులో భాగంగా రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝాకు కాళేశ్వరం జోన్-1 డీఐజీగా, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డి. జోయెల్ డేవిస్‌కు యాదాద్రి జోన్-5 డీఐజీగా, సీఐ సెల్ డీఐజీ ఆర్. భాస్కరన్‌కు జోన్-2 (బాసర) డీఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ సింధు శర్మను సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై.సాయిశేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్. ప్రవీణ్ కుమార్‌ను సీఐడీ ఎస్పీగా నియమించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 22 మంది నాన్ కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖాగోయల్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న జి.బస్వారెడ్డిని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీగా నియమించారు. అటవీశాఖలో పనిచేస్తున్న 15 మంది ఐఎఫ్ఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్నవారితో పాటు ఇటీవల ఐఎ?ఫఎస్‌గా పదోన్నతి పొందిన వారికీ పోస్టింగులు లభించాయి.

**సీషెల్స్ స్వాతంత్ర్య వేడుకల్లో**

# భారత సైనిక దళాల కవాతు..

**లేచి నిలబడిన ప్రధాని మోదీ**



2

# గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది

**శివరాజ్‌సింగ్**



# వైసీపీ కొత్త డ్రామా... (మొదటిపేజీ తరువాయి)

పరామర్శకు వెళ్లేటప్పుడు రౌడీషీటర్లను ఎందుకు తీసుకెళ్లాలని నిలదీశారు. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన మంత్రులను కోరారు.

**అనితపై అమర్నాథ్‌వి అసభ్యకర వ్యాఖ్యలు**

హోంమంత్రి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అసహ్యకరమైనవని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి చర్చకు పెట్టాలని మంత్రులను సీఎం చంద్రబాబు కోరారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం ఏమిటి? దీనిపై వైసీపీ వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. సోషల్ మీడియాలో కూడా అనితకు సానుభూతిగా పోస్టులు పెడుతున్నారు." అని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు స్పందిస్తూ.. ఈ విషయంపై మంత్రులందరం వేగంగా స్పందించామని, అనిత కూడా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హుందాగా మాట్లాడారని సీఎంకు తెలిపారు.

అనితను దూషించిన అమర్నాథ్ జగన్‌ను కలవడానికి వెళితే....శభాష్ అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు పత్రికల్లో వచ్చాయని మంత్రి అనగాని తెలపగా, ఇటువంటి అంశాలనే ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. విజయవాడ కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో జరిగిన కస్టోడియల్ డెత్‌పై ప్రభుత్వం తీసుకున్న చర్యలపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఘటనలో మరణించిన సాయికృష్ణ నేరచరిత్ర గురించి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని మంత్రులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. నేరచరిత్ర ఉన్నప్పటికీ పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వ్యవహరించకూడదని, చట్ట ప్రకారమే శిక్షించాలని సీఎం అన్నారు. అందుకే ప్రభుత్వం ఈ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయిస్తోందని, సిట్‌ను కూడా నియమించామన్నారు. సీఐ నాగరాజుపై హత్య కేసు నమోదు చేసి, అరెస్టు కూడా చేసిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. సాయికృష్ణ ఘటనపై ప్రభుత్వం బాగా స్పందించిందని మంత్రులు వ్యాఖ్యానించారు. ఇదే అంశంపై కొంతమంది వైసీపీ నేతలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సీఎం సూచించారు. పవన్‌ను ఓ కులానికే పరిమితం చేయాలనే ఉద్దేశంతో ఆయనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసీపీ కుట్రలను ఎక్కడికక్కడ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరి పోరుకే సై?... (మొదటిపేజీ తరువాయి)

మరో ముఖ్యనేత పేర్కొన్నారు. పార్టీలో సాగుతున్న కోవర్టు రాజకీయాలపై అధినాయకత్వం వద్ద సమగ్ర సమాచారం ఉందన్నారు. "ముఖ్యంగా ఇటీవలి మునిసిపల్ ఎన్నికల సందర్భంగా కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు అనుసరించిన వైఖరి పట్ల అగ్రనాయకత్వం సీరియస్‌గా ఉంది. అందుకే.. నితిన్ నబీన్ పరోక్షంగా సదరు నేతలకు వార్నింగ్ ఇచ్చారు" అని ఆ నేత తెలిపారు.

**నాలుగు కార్పొరేషన్‌లపై ప్రత్యేక నజర్..**


వచ్చే ఎన్నికల్లో అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలంటే.. అందుకు ముందుగా ఎన్నికలు జరిగే నాలుగు మునిసిపల్ కార్పొరేషన్‌లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయించింది. జీహెచ్‌ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్, వరంగల్ మునిపల్ కార్పొరేషన్‌ల ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలను పార్టీ నాయకత్వం.. మహారాష్ట్ర మంత్రి ఆశిశ్, రాజ్యసభ సభ్యురాలు రేఖాశర్మకు అప్పగించింది. "జీహెచ్‌ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లలో మెజారిటీ డివిజన్లు మా పార్టీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల (సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మెదక్) పరిధిలో ఉన్నాయి. ఇక వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ బాధ్యతను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి అప్పగించే అవకాశం ఉంది. ఇటీవలి మునిసిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను పార్టీ తొలిసారిగా గెలుచుకున్న నేపథ్యంలో.. సంజయ్‌కి వరంగల్ బాధ్యతలు అప్పగించాలన్న ప్రతిపాదన ఉంది. మరోవైపు గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా విస్తృత ప్రచారం చేసి అనూహ్య ఫలితాలు సాధించడంలో సంజయ్ కీలక పాత్ర పోషించారు. సంజయ్ స్పీచ్‌లు, ప్రచార తీరుతో క్యాడర్‌లో సైతం జోష్ వచ్చింది. వివిధ సామాజికవర్గాలను ఆకర్షించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. ఈ నేపథ్యంలో పూర్వపు జీహెచ్‌ఎంసీ పరిధిలో కూడా సంజయ్‌ని ప్రచారంలోకి దింపాలన్న ప్రతిపాదన ఉంది" అని పార్టీ ముఖ్యనేత ఒకరు చెప్పారు. ఈ నాలుగు కార్పొరేషన్‌లలో ప్రచార వ్యూహంపై పార్టీ నాయకత్వం త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోబోతోందన్నారు.

**రోడ్‌మ్యాప్ మరింత సులువయ్యేలా..**

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 111 స్థానాలకు పోటీచేసి 8 చోట్ల మాత్రమే విజయం సాధించిన బీజేపీ.. ఆ తర్వాత ఆరు నెలలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా 50 శాతం సీట్లు (8 ఎంపీ స్థానాలు) కైవసం చేసుకుంది. అనంతరం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింటిని కైవసం చేసుకుని ఓటు బ్యాంకు పెంచుకుంది. ఆపై ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో ప్రధానంగా ఉత్తర తెలంగాణలో గట్టి పట్టు సాధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు నాలుగు మునిసిపల్ కార్పొరేషన్‌లను సైతం కైవసం చేసుకుని వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రోడ్‌మ్యాప్ మరింత సులువు చేసుకునే దిశగా కార్యాచరణ సిద్ధమవుతోందని పార్టీ సీనియర్ నేత ఒకరు వివరించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో పార్టీ అగ్రనేతల విస్తృత పర్యటనలు ఉండబోతున్నాయని అన్నారు. "రెండు నెలల వ్యవధిలో ప్రధాని మోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటనకు వచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు ఇకముందు కూడా కొనసాగుతాయి. కేంద్ర మంత్రులు, పార్టీ సంస్థాగత ముఖ్యుల పర్యటనలు మరిన్ని ఉండబోతున్నాయి" అని ఆయన చెప్పారు.

# సీషెల్స్ స్వాతంత్ర్య వేడుకల్లో
# భారత సైనిక దళాల కవాతు..

## లేచి నిలబడిన ప్రధాని మోదీ



విక్టోరియా: భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నేడు (సోమవారం) భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి ఆదివారం నాడు అందజేశారు.


# ఏఐ విఫలం.. ఫోర్డ్ కంపెనీలో మళ్లీ ఇంజనీర్ల నియామకం

**న్యూఢిల్లీ, జూన్ 29:**

ఏఐతో ఆశించిన ఫలితాలు లేకపోవడంతో ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోర్డ్ మళ్లీ ఇంజనీర్లను నియమించుకుంటోంది. గతంలో ఉద్యోగాల నుంచి తీసేసిన వారిని కూడా మళ్లీ సంస్థలోకి ఆహ్వానిస్తోంది. ఇంజనీర్ల రాకతో పరిస్థితులు ఇప్పటికే మెరుగయ్యాయి. వాహనాల నాణ్యత పరీక్షల కోసం గతంలో ఫోర్డు ఏఐవైపు మొగ్గు చూపింది. కానీ ఏఐ పనితీరు ఆశించిన మేర లేకపోవడంతో కంపెనీ ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు పడిపోయాయి. జేడీ పవర్ క్వాలిటీ సర్వేలో వెనకబడింది. దీంతో పరిస్థితులను గాడిలో పెట్టేందుకు ఫోర్డ్ మళ్లీ ఇంజనీర్లను రంగంలోకి దించింది. దీంతో, నెలల వ్యవధిలోనే కంపెనీ ర్యాంకు మెరుగుపడింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, గత మూడేళ్లల్లో ఫోర్డ్ 350 మంది అనుభవజ్ఞులైన ఇంజనీర్లను క్వాలిటీ కంట్రోల్ చెక్స్ కోసం నియమించుకుంది. వీరిలో కొందరు మాజీ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఏఐపై అతిగా ఆధారపడ్డామని కంపెనీ సీనియర్ అధికారులు కూడా అంగీకరించారు. ఏళ్ల తరబడి అనుభవాన్ని గడించిన ఇంజనీర్లను పక్కనపెట్టడం పొరపాటేనని అన్నారు. ఏఐ సామర్థ్యాల గురించి అతిగా ఊహించుకున్నామని ఫోర్డ్ వైహికిల్ హార్డ్‌వేర్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఛార్ల్స్ పూన్ వ్యాఖ్యానించారు. 'ఏఐని, డిజైన్ అవసరాలను అనుసంధానిస్తే మంచి నాణ్యత గత ఉత్పత్తులు వస్తాయని పొరపాటున అనుకున్నాము' అని ఆయన అన్నారు. ఎలాంటి సమాచారంతో శిక్షణ ఇచ్చామన్న దానిపైనే ఏఐ సమర్థత ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. అయితే, ఏఐ ఒక అద్భుత సాధనమని కూడా ఆయన అంగీకరించారు. ఎన్నో ఏళ్ల పాటు సంస్థలో పనిచేసిన ఇంజనీర్ల అనుభవాన్ని సేకరించి రికార్డు చేయడంలో తాము చేయవల్సినంత చేయలేదని అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఏఐతో సాధ్యం కాని పనులకు మళ్లీ ఇంజనీర్ల నియామకాన్ని చేపడుతున్నట్టు చెప్పారు.

# గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది: శివరాజ్‌సింగ్

**న్యూఢిల్లీ, జూన్ 29:**



తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్‌ఎంఏజీఐ కి నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్‌ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు.

# ఉపాధి హామీపై.. (మొదటిపేజీ తరువాయి)

సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రాల సూచనలను పరిగణనలోకి తీసుకుం టామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. గ్రామీణ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. గ్రామీణ ఉపాధి హక్కు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన విధానపరమైన మార్పులు చేయాలని మంత్రి దనసరి సీతక్క సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

# బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

**- మంచిర్యాల జిల్లాలో ఘటన**

**- గంటల పాటు అవస్థలు పడ్డ ప్రయాణికులు**

**- జేసీబీతో బస్సును బయటకు తీసిన గ్రామస్తులు**




**మంచిర్యాల, జూన్ 29**

మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాల కారణంగా రహదారి బురదమయంగా మారడంతో ఆర్టీసీ బస్సు రోడ్డుపై కూరుకుపోయింది. హాజీపూర్ మండలం దొనబండ సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు ముందుకు కదల్లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. సమాచారం ప్రకారం సాధారణ ప్రయాణంలో ఉన్న ఆర్టీసీ బస్సు దొనబండ సమీపానికి చేరుకోగానే వర్షాలతో బురదగా మారిన రహదారిలో చక్రాలు దిగబడిపో యాయి. డ్రైవర్ పలుమార్లు బస్సును బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలి తం లేకపోయింది. దీంతో బస్సు అక్కడే నిలిచిపోవాల్సి వచ్చింది. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చింది. సమీప గ్రామాల ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సును బయటకు తీసేందుకు ప్రయత్నించినా సాధ్యంకాకపోవడంతో జేసీబీని తీసుకొచ్చారు. జేసీబీ సహాయంతో బస్సును బురదలో నుంచి నెమ్మదిగా బయటకు లాగడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం బస్సు తిరిగి ప్రయాణాన్ని కొనసాగించింది. ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంత రహదారి దుస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు తెలిపారు. రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి ప్రయాణానికి అనువుగా మార్చాలని వారు అధికారులను కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దెబ్బతిన్న గ్రామీణ రహదారుల మరమ్మతులకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే ఇలాంటి ఘటనలు పునరావృతమై ప్రజలు, విద్యార్థులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సేవలు అభినందనీయం

**- ఉద్యోగుల సన్మాన సభలో సీఎం డీకే శివకుమార్**

**బెంగళూరు, జూన్ 29**

కర్ణాటక విద్యుత్ ప్రసార సంస్థ ఉద్యోగుల సంఘాలు సంయుక్తంగా బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సన్మాన సభలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఇంధన శాఖ మంత్రి కేజే జార్జ్‌తో కలిసి హాజరైన ఆయన, విద్యుత్ శాఖ ఉద్యోగుల సేవలను అభినందిస్తూ వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడు తూ రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించడంలో ఉద్యోగుల అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉద్యోగుల శ్రమ వల్లే పరిశ్రమలు, వ్యవసాయం, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతున్నాయని కొనియాడారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. వారి సమస్యల పరిష్కారం, శాఖ బలోపేతం, మెరుగైన సేవా పరిస్థితుల కల్పనకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. శాఖ పురోగతిలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. సభకు హాజరైన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అందించిన ఘన స్వాగతానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇదే అంకితభావంతో పనిచేయాలని ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. బాలరామ్, ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు సి. బసవన్నతో పాటు విద్యుత్ సరఫరా సంస్థల వివిధ సంఘాల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యుత్ రంగ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ రంగం మరింత బలోపేతం కావాలంటే ప్రభుత్వం, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పిలుపునిచ్చారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం సమానంగా పరిగణిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రభుత్వ భూమిని మింగేస్తున్న

# భూ మాఫియా..!

### సర్వే నంబర్-7లో కోట్ల విలువైన భూమిపై రియల్ జోరుగా దందా..!

### జీఓ-76ను అడ్డం పెట్టుకుని అక్రమ పట్టాల కుట్ర..

### అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..?

**మందమర్రి, జూన్ 30,(మన సమాజం):**
మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ పట్టణంలోని సర్వే నంబర్--7లో ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై భూ మాఫియా కన్నేసింది. ప్రభుత్వ ఆస్తిని కబ్జా చేసి, కోట్ల రూపాయలు దండుకునేందుకు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మాజీ ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజల అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని వ్యక్తిగత ఆస్తిలా మార్చుకుని అమ్ముకోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**పాఠశాల పేరుతో భూమి... ఇప్పుడు ప్లాట్లుగా విక్రయం..!**
గతంలో సింగరేణి సంస్థ లీజు ప్రాతిపదికన ప్రైవేట్ పాఠశాల నిర్వహణ కోసం కేటాయించిన భూమిని, పాఠశాల మూతపడిన తర్వాత ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా, అదే భూమిని అక్రమంగా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొంత భూమిని రియల్ వ్యాపారులు విక్రయించారని, మిగిలిన భూమిని కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.





**జీఓ-76ను కవచంగా మార్చుకుని ప్రభుత్వ భూమిపై పట్టాల వేట..!**
సింగరేణి భూముల్లో ఇప్పటికే నివాసాలు నిర్మించుకున్న అర్హుల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ-76ను, కొందరు తమ అక్రమాలకు రక్షణ కవచంగా మార్చుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిపై హక్కు లేకపోయినా, అక్రమంగా పట్టాలు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పటికే కొంత మేర పట్టాలు కూడా పొందినట్లు ప్రచారం జరుగుతోంది. నిజంగా అర్హులైన పేదలకు ఉపయోగపడాల్సిన నిబంధనలను భూ వ్యాపారులు తమ లాభాలకు వాడుకోవడం దారుణమని ప్రజలు మండిపడుతున్నారు.

**అధికారుల మౌనం... అక్రమాలకు అండనా..?**
ప్రభుత్వ భూమి కళ్లముందే ప్లాట్లుగా మారుతున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత భూమి పై ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్నా అధికారులు నోరు మెదపకపోవడం వెనుక కారణాలేమిటని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు తమ బాధ్యతలను విస్మరించి అక్రమాలకు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిని వ్యక్తిగత ఆస్తిగా మార్చుకుని కోట్ల రూపాయల రియల్ వ్యాపారం చేయాలనే ప్రయత్నాలపై ప్రభుత్వం వెంటనే ప్రత్యేక విచారణకు ఆదేశించి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వసతి గృహాలను తనిఖీ చేసిన మున్సిపాలిటీ కమిషనర్





**ములుగు జిల్లా జూన్ 29**
వసతి గృహాలను అకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపాలిటీ కమిషనర్ జే.సంపత్.సోమవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం,ఎస్సీ బాలుర వసతి గృహం,బీసీ వసతి గృహాలను కమిషనర్ తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థుల కు అందిస్తున్న భోజన నాణ్యత, వంటగది పరిశుభ్రత,తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, హాస్టల్ గదుల పరిశుభ్రత, విద్యుత్,పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలైన భవనాల నిర్వహణ,తాగునీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్లు, వంటగది,డైనింగ్ హాల్, పడకల ఏర్పాటు, ఫర్నిచర్, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.హాస్టల్ నిర్వాహకులు విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం,భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విద్యార్థులకు పోషకాహారం నాణ్యతతో అందించడంతో పాటు ఎటువంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఉదయ్ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రామాలయం విరాళాల

# దోపిడీ కేసులో వాదించం

### ఫైజాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయం

### 'అయోధ్య'పై అత్యవసర విచారణను కోరిన పిటిషనర్‌తో సుప్రీం కోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జూన్ 29:**



అయోధ్య రామాలయం దోపిడీ కేసులో నిందితుల తరపున వాదించకూడదని యూపీలోని ఫైజాబాద్ బార్ అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. తీర్మానాన్ని ఉల్లంఘించి నిందితుల తరపున ఎవరైనా వాదిస్తే... వారికి రూ.5లక్షల జరిమానా విధించాలని కూడా నిర్ణయించారు. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రస్ట్ పెద్దలు చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావులు మూడు రోజుల్లోగా అయోధ్యను విడిచి వెళ్లాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. లేదంటే నగరాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. కాగా, కానుకల చోరీ వ్యవహారంపై నిష్పాక్షిక విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. వేసవి సెలవులు ముగిసిన తర్వాతే ఈ అంశంపై విచారణ చేపడతామని జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ శీల్ నాగుతో కూడిన ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది. 'అంత అత్యవసరం ఏముంది? ఆకాశమేం ఊడి మీద పడదులే..' అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌ను న్యాయవాదులు అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ దాఖలు చేశారు. మరోవైపు.. రామ మందిరం కేసులో అరెస్టయిన 8 మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక కోర్టు సోమవారం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

# ఢిల్లీలో పెట్రోల్ ద్విచక్ర వాహనాలకు చెక్!

### 2028 ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్లు బంద్

**న్యూఢిల్లీ, జూన్ 29:**



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు ముఖ్యమంత్రి రేఖా గుప్తా నేతృత్వంలోని సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2030 నాటికి ఢిల్లీని పూర్తి స్థాయి ఈవీ నగరంగా మార్చడమే లక్ష్యంగా కొత్త ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) పాలసీ 2.0కి క్యాబినెట్ సోమవారం ఆమోదముద్ర వేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తర్వాత జూలై 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ కొత్త పాలసీ.. 2030 మార్చి 31 వరకు అమల్లో ఉండనుంది. ఈ పాలసీ మేరకు.. 2028 ఏప్రిల్ 1 నుంచి కొత్త పెట్రోల్ ద్విచక్ర వాహనాల (బైక్‌లు, స్కూటర్లు) రిజిస్ట్రేషన్లను పూర్తిగా నిలిపేయనున్నారు. అంతకుముందే 2027 జనవరి 1 నుంచి పెట్రోల్/సీఎన్‌జీ త్రీ వీలర్ల (ఆటో రిక్షా) రిజిస్ట్రేషన్లు నిలిచిపోనున్నాయి. అంటే ఈ నిర్దేశిత తేదీల తర్వా త కేవలం ఈవీ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తారు. అయితే ఇప్పటికే ఉన్న పాత పెట్రోల్ వాహనాలను వాడుకోవచ్చు. ఇక రూ.30 లక్షల్లోపు ఎక్స్ షో రూమ్ ధర కలిగిన ఎలక్ట్రిక్ కార్లకు 100శాతం రహదారి పన్ను, రిజిస్ట్రేషన్ పన్నుల నుంచి పూర్తి మినహాయింపునిచ్చారు. అంతకుముందు ముసాయిదా బిల్లులో పేర్కొన్న మేరకు హైబ్రిడ్ కార్లకు ప్రతిపాదించిన 50శాతం రాయితీని ఎత్తేశారు. కొత్త పాలసీలో ఈవీ కొనుగోలుదారులకు భారీ సబ్సిడీలను ప్రకటించారు. ఈవీ ద్విచక్ర వాహనాల కొనుగోలుదారులకు మొదటి సంవత్సరం 30 వేలు, రెండో ఏడాది 20 వేలు, మూడో ఏడాదిలో రూ.10 వేల వరకు సబ్సిడీ ఇవ్వనున్నారు. అలాగే త్రిచక్ర వాహనాల కొనుగోలుదారులకు తొలి ఏడాది 50 వేలు, రెండో ఏడాది 40 వేలు, మూడో ఏడాదిలో 30 వేల వరకు రాయితీ ఉంటుంది. కొత్తగా కొనుగోలు చేసే లైట్ కమర్షియల్ ఈ-ట్రక్కులకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు సబ్సిడీ అందనుంది. బీఎస్-4 లేదా అంతకంటే పాత కా ర్లను తుక్కుగా మార్చి.. ఎలక్ట్రిక్ వాహనాలకు మారే వారికి రూ.లక్ష స్క్రాపేజ్ ప్రోత్సాహకం కూడా లభించనుంది.

**రూ.15 వేల కోట్ల కేటాయింపు..**
వచ్చే నాలుగేళ్లలో ఈ సరికొత్త ఈవీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఢిల్లీ సర్కారు రూ.15 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఇందులో రూ.7 వేల కోట్లను ఈవీల కొనుగోలుదారులకు సబ్సిడీలుగా ఇవ్వనుంది. మిగిలిన రూ.8 వేల కోట్లతో ఢిల్లీ వ్యాప్తంగా దాదాపు 30 వేల కొత్త ఈవీ చార్జింగ్ పాయింట్లతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయనున్నారు.

## సర్ కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**రామకృష్ణాపూర్, జూన్ 29, (మన సమాజం):**
సర్ కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్( స్పెషల్ ఇంటెన్సీ రివిజన్) కార్యక్రమంలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. బిఎల్ఓ నుండి వివరాలను తెలుసుకున్నారు. ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్లో సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఒక ఓటరుకు రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్నట్లయితే ఓటరు కోరుకున్నచోట ఒకే ప్రాంతంలో ఓటు నమోదు చేయబడునని పేర్కొన్నారు. సర్ ప్రక్రియను పకడ్బందీగా సర్వే నిర్వహించి సమగ్ర నివేదికను అందజేయాలని సంబంధిత బిఎల్ఓ లను ఆదేశించారు. కలెక్టర్ వెంట మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్ ఉన్నారు.

## బొక్కలగుట్టలో వ్యక్తి దారుణ హత్య..

**పాత కక్ష్యలే కారణం.**

**కుటుంబ సభ్యుల ఫిర్యాదు..**

**కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్న పోలీసులు..**



**రామకృష్ణాపూర్, జూన్ 29, (మన సమాజం):**
రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్య కలకలం రేపింది. మందమర్రి సిఐ పర్స రమేష్ తెలిపిన వివరాల ప్రకారం బొక్కల గుట్ట గ్రామానికి చెందిన గజ్జి వెంకటేష్(40) ను అదే గ్రామానికి చెందిన ఒడ్డపల్లి రాజ్ కుమార్ పాత కక్ష్యల కారణంతో కక్ష్య పూరితంగా గడ్డ కట్టిన సిమెంట్ రాయితో తలపై కొట్టడంతో వెంకటేష్ కు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాత పడినట్లు తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచణామ చేసినట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు రిషి వర్మ, శశి వర్ధన్ ఉన్నారు.

## సర్ ప్రోగ్రాం విజయవంతం చేయాలి

**బిఎల్ఎ లకు దిశా నిర్దేశం.**

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి..**

**రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి..**



**రామకృష్ణాపూర్, జూన్ 29, (మన సమాజం):**
మున్సిపాలిటీ పరిధిలో సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లకు రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. స్థానిక బీమా గార్డెన్ లో సోమవారం ఏర్పాటుచేసిన బిఎల్ఎ-2 సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న పార్టీ కార్యకర్తలకు సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పార్టీ పరంగా ఓటరు వివరాలు కోల్పోకుండా వ్యవహరించాలని సూచించారు. ఇంటింటికి సర్వే చేస్తూ ప్రతి ఓటర్ వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెన్నూరు నియోజకవర్గం లో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అలాగే డిఎంఎఫ్టి నిధులు నియోజకవర్గ అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో గెలిచిన పార్టీ కౌన్సిలర్ల వార్డులకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తానని గెలిచిన కౌన్సిలర్లకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చందనగిరి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గోపతి బానేష్, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు కూతురు ప్రభాకర్, బీమా మల్లేష్, గుర్రం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజం, అబ్దుల్ అజీజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విరాళాల కేసులో కొత్త కోణాలు

- నిందితుడి ఆస్తులపై పోలీసుల ఆరా
- తక్కువ జీతంతో విలాసవంతమైన జీవనం
- బ్యాంకు లావాదేవీలు, ఆస్తులపై దర్యాప్తు ముమ్మరం





**లక్నో, జూన్ 29**
అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసు దర్యాప్తులో ఉత్తరప్రదేశ్ పోలీసులకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో అరెస్టైన అనుకల్ప్ మిశ్రా అనే నిందితుడి ఆస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అతడి ఆదాయానికి మించిన స్థాయిలో ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించిన పోలీసులు, వాటి మూలాలపై లోతుగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు ప్రకారం 22 ఏళ్ల అనుకల్ప్ మిశ్రా నెలకు సుమారు రూ.15 వేల జీతం మాత్రమే పొందుతున్నప్పటికీ, ఇటీవల అయోధ్యలో రూ.65 లక్షల విలువైన ఇంటిని కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తన స్వగ్రామంలో ఫార్మ్‌హౌస్ నిర్మించడంతో పాటు ఖరీదైన ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. తాజాగా మరో విలాసవంతమైన కారు కొనుగోలు ప్రక్రియ కూడా ప్రారంభించినట్లు సమాచారం. మూడేళ్ల క్రితమే ఆలయానికి సంబంధించిన ఉద్యోగంలో చేరిన వ్యక్తి ఇంత తక్కువ సమయంలో ఇంత భారీ ఆస్తులు ఎలా సంపాదించాడన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అతడి ఆదాయం చట్టబద్ధమైన మార్గాల ద్వారానే వచ్చిందా లేదా విరాళాల దుర్వినియోగంతో సంబంధం ఉందా అనే అంశాలపై అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నారు. నిందితుడి నివాసంలో సోదాలు నిర్వహించిన దర్యాప్తు బృందం బ్యాంకు ఖాతాలు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆర్థిక రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తోంది. ఇటీవల అతడు నిర్వహించిన ఖరీదైన ధార్మిక కార్యక్రమాల ఖర్చులపై కూడా ఆరా తీస్తోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితిలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులపై స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. ఈ కేసులో అరెస్టైన ఇతర నిందితుల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఎవరికైనా ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయా, విరాళాల నిధులతో సంబంధం ఉందా అనే అంశాలపై సమగ్ర విచారణ కొనసాగుతోంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఆలయ నిధుల నిర్వహణపై కూడా విచారణ సంస్థలు దృష్టి సారించాయి. ఈ వ్యవహారంలో బాధ్యులెవరో పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం తేలనుంది. నిందితులపై లభించే ఆధారాల మేరకు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

# అఫ్గాన్‌పై పాక్ భీకర వైమానిక దాడులు

- 'డబుల్ ట్యాప్' దాడులపై తీవ్ర వివాదం
- ఉగ్రవాదులే లక్ష్యమన్న పాకిస్థాన్
- అమాయక పౌరులే బలయ్యారన్న అఫ్గానిస్థాన్




**ఇస్లామాబాద్, జూన్ 29**
అఫ్గానిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ సైన్యం నిర్వహించిన వైమానిక దాడులు మరోసారి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచాయి. పక్తియా, పక్తికా, కునార్ ప్రావిన్స్‌లలో ఉగ్రవాదుల స్థావరాల ను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఈ దాడుల్లో 29 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ఇస్లామాబాద్ పేర్కొనగా, అమాయక పౌరులు మరణించారని అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. దాడుల్లో అత్యంత వివాదాస్పదంగా మారింది 'డబుల్ ట్యాప్' వ్యూహం. మొదటి వైమానిక దాడి అనంతరం శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు స్థానికులు, సహాయక సిబ్బంది చేరుకున్న సమయంలో అదే ప్రాంతంపై మరోసారి దాడులు జరిగినట్లు అఫ్గాన్ అధికారులు ఆరోపించారు. ఈ రెండో దాడిలోనే మరణాలు, గాయాల సంఖ్య భారీగా పెరిగినట్లు వారు వెల్లడించారు. ఈ విధానం అంతర్జాతీ యంగా తీవ్ర విమర్శలకు గురవుతోంది. పాకిస్థాన్ మాత్రం తమ దాడులు పూర్తిగా ఉగ్రవాద సంస్థలపైనే జరిగాయని స్పష్టం చేసింది. ఇటీవల కరాచీలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. జమాత్-ఉల్-అహ్రార్, తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్‌కు చెందిన స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఖచ్చితమైన దాడులు నిర్వహించామని, 29 మంది మిలిటెం ట్లను హతమార్చినట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం మాత్రం పాకిస్థాన్ వాదనలను పూర్తిగా ఖండించింది. దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా కనీసం 36 మంది పౌరులు మరణించారని, 160 మందికిపైగా గాయపడినట్లు తెలిపింది. తమ భూభాగంలో ఉగ్రవాదులకు ఆశ్రయం లేదని, నివాస ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ దాడులు నిర్వహించిందని ఆరోపించింది. 2021లో తాలిబన్‌లు అఫ్గానిస్థాన్‌లో అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాకిస్థాన్ తరచూ అఫ్గాన్ భూభాగంలో పనిచేస్తున్న మిలిటెంట్ గుంపులను కారణంగా చూపుతుండగా, కాబూల్ ప్రభుత్వం ఈ ఆరోపణలను నిరంతరం ఖండిస్తోంది. ఇటీవల నెలల్లో సరిహద్దు ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చి పలు దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకున్నాయి. తాజా ఘటనతో ప్రాంతీయ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ సమాజం ఇరు దేశాలు సంయమనం పాటించాలని, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని కోరుతోంది. అయితే సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉండటంతో భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన మంత్రి

- ఏలబోతారంలో ఎస్ఐఆర్‌పై క్షేత్రస్థాయి తనిఖీ
- అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయాలని ఆదేశం
- గ్రామస్తులకు అవగాహన కల్పించిన పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, జూన్ 29 :**
కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలం ఏలబోతారం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరిశీలించారు. ఇంటింటికీ జరుగుతున్న ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తూ బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లతో (బీఎల్‌ఏలు) మాట్లాడి ప్రక్రియ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. 2002, 2025 ఓటరు జాబితాలను ప్రామాణికంగా తీసుకుని ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారిని జాబితాలో చేర్చాలని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో నేరుగా మాట్లాడిన మంత్రి, ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించాలని అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండాలని అన్నారు. స్వచ్ఛమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే మాత్రమే ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# అధికారులతో సీఎం విజయ్ సమావేశం

- పరిపాలన, శాంతిభద్రతలపై సమీక్ష
- సమర్థవంతమైన పాలనపై అధికారులకు దిశానిర్దేశం
- సచివాలయంలో జిల్లా స్థాయి అధికారుల సదస్సు




**చెన్నై, జూన్ 29 :**
తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ ఆదివారం చెన్నై సచివాలయంలోని నామక్కల్ కవిగ్నర్ మాళిగైలో నిర్వహించిన జిల్లా కలెక్టర్లు, పోలీసు శాఖ ఉన్నతాధికారుల సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం, శాంతిభద్రతలను పటిష్ఠంగా అమలు చేయడం వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిపాలనా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాల్లో మరింత సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు పురోగతి, జిల్లా స్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాల వారీగా అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. అభివృద్ధి పనుల పురోగతి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం, సమర్థ పరిపాలన, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ పిలుపునిచ్చారు.

# ఏరువాకతో ఖరీఫ్‌కు శ్రీకారం

- రైతులతో కలిసి నాగలి దున్నిన మంత్రి పొన్నం ప్రభాకర్
- కూరెళ్ల గ్రామంలో విత్తనాలు చల్లి వ్యవసాయ పనుల ప్రారంభం
- రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి



**హుస్నాబాద్, జూన్ 29**
ఏరువాక పౌర్ణమి సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం కూరెళ్ల గ్రామంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులతో కలిసి ఖరీఫ్ వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. నాగలి దున్ని, విత్తనాలు చల్లుతూ సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతాంగ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. రైతులు భూమాతకు నమస్కరించి కొత్త సాగు పనులను ప్రారంభించే ఈ రోజు ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని భూమాతను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రైతే దేశానికి వెన్నెముక అని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సాగునీటి వసతుల కల్పన, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, వ్యవసాయ మౌలిక సదుపా యాల అభివృద్ధితో పాటు రైతులకు అన్ని విధాలా అండగా ప్రభుత్వం నిలుస్తోందని వివరించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలని మంత్రి రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటిస్తూ పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రకృతి అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి అన్ని పంటలు క్రిమి, కీటకాల బెడద లేకుండా బాగా పండాలని, రైతులకు మంచి ఆదాయం రావాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులతో కలిసి మంత్రి వ్యవసాయ పనుల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.